సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 20 ၊ ఆగస్టు ၊ 2025



కేబుల్ వైర్లు కట్ చేయాల్సిందే

విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లతో ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. - 8లో



సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తుమ్మల ప్రవుల్ రాంరెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	584.60 అడుగులు
ఇన్‌ఫ్లో	:	4,10,186 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	4,09,506 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	23,007 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	7,528 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,949 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సీఎంఆర్ బకాయిలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

భానుపురి (సూర్యాపేట) : సీఎంఆర్ బకాయిలు 2024–25 వానాకాలం సీజన్‌కు సంబంధించినవి సెప్టెంబర్ 12 నాటికి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం వేగవంతంగా మిల్లింగ్ చేసి ఇచ్చిన గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని సూచించారు. పౌర సరఫరా అధికారులు మిల్లుల్లో తనిఖీలు చేపట్టాలని, రోజువారీ నివేదికలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మోహన్‌బాబు, ఏఎస్‌ఓ శ్రీనివాస రెడ్డి, డీటీ రాజశేఖర్, ఆర్‌ఐలు శ్రీకాంత్, ప్రమోద్, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

నడిగూడెం : పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంట గది, హాస్టల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితే అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వానాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కోదాడ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయ మనోహరి, ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎంపీఓ విజయకుమారి, ప్రిన్సిపాల్ వాణి, డాక్టర్.హరినాథ్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎం సుజాత, ఆశా కార్యకర్తలు సైదమ్మ, సునిత, స్టాఫ్‌నర్స్ నాగలక్ష్మి, ఉన్నారు.

మెడికల్ షాపు తనిఖీ



మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

తుంగతుర్తి: అనుమతులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని సాయి బాలాజీ ఆస్పత్రిలో గల మెడికల్ దుకాణాన్ని పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. మహిళకు వైద్యం చేసేటప్పుడు ఎలాంటి మందులు ఉపయోగించారో పరిశీలించారు. వారివెంట సీఐ నరసింహారావు, ఎస్‌ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

‘కసరత్తు’కు కష్టాలు

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు నిర్వహణ లేక నీరసించిపోతున్నాయి. పర్యవేక్షణ లోపంతో పరికరాలు మూలనపడుతున్నాయి. జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉండగా.. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. నేరేడుచర్ల, తిరుమలగిరి పట్టణాల్లో ఏర్పాటు చేయలేదు. అయితే ఓపెన్ జిమ్‌లు ఉన్న మున్సిపాలిటీల్లోనూ వాటి పరిస్థితి గాలిలో దీపంలా మారింది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వ్యాయామ పరికరాలు పాడైపోతున్నాయి.

- నిర్వహణ లేక నీరసించిపోతున్న ఓపెన్‌జిమ్‌లు
- పర్యవేక్షణ లోపంతో పాడైపోతున్న పరికరాలు
- మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలంటున్న పట్టణ ప్రజలు



సూర్యాపేటలోని నంబర్ 2 స్కూల్ దగ్గర ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన రబ్బర్ టైల్స్

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలో 2018లో సీడీఎంఏ ఆధ్వర్యంలో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వాటి వల్ల ప్రజలకు ఉపయోగం ఉండడంతో ప్రభుత్వం 2022లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో రూ.50 లక్షలతో మరో ఏడు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. మొత్తంగా సూర్యాపేట పట్టణంలో తొమ్మిది ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. అయితే వాటి నిర్వహణను అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. కొత్తగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన చోట సిమెంట్ ఫ్లోరింగ్‌పై రబ్బర్ షీట్లు వేశారు. వాటిని గమ్‌తో అతికించడంతో కొన్నాళ్లకే ఊడిపోయాయి. వర్షం పడితే పైకి తేలుతున్నాయి. వీటిపై విమర్శలు రావడంతో అధికారులు మెత్తటి టైల్స్ వేయడం ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ప్రస్తుతం కొన్ని వస్తువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. సమస్య గురించి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఓపెన్ జిమ్‌కు వచ్చే వారు చెబుతున్నారు. ఎన్టీఆర్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినా పార్కుకు తాళాలు వేస్తుండడంతో అక్కడికి వెళ్లే స్థానికులు ఓపెన్ జిమ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు.

మున్సిపాలిటీ	ఓపెన్ జిమ్‌లు	జనాభా
సూర్యాపేట	09	1,33,339
కోదాడ	తొలగించారు	75,093
హుజూర్‌నగర్	02	35,850



సూర్యాపేటలోని ఓపెన్ జిమ్‌లో మరమ్మతులకు గురైన పరికరం

మరమ్మతులు చేపట్టాలి



ప్రతిరోజు జూనియర్ కాలేజీలోని ఓపెన్ జిమ్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో వస్తుంటాం. కసరత్తు చేసే పరికరాలు పాడైపోయాయి. అవి సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి.

– బొర్ర పుల్లయ్య, చర్చి కంపౌండ్, సూర్యాపేట

చందాలు వేసుకుని పరికరాలకు రిపేర్ చేయించాం



ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్యాపేటలోని ఓపెన్ జిమ్‌కు వస్తుంటాం. పరికరాలు పాడవడంతో తేలికపాటి వ్యాయామాలు చేసుకోవడానికి కష్టమవుతోంది. ఒకసారి ఓపెన్ జిమ్‌కు వచ్చే వాళ్లం చందాలు వేసుకొని రిపేరు చేయించాం. అవి మళ్లీ పాడైపోయాయి. అధికారులు స్పందించి పాడైపోయిన వాటి స్థానంలో కొత్తవి బిగించి వినియోగంలోకి తేవాలి.

– పడిశాల ఊశయ్య, సూర్యాపేట



సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన పరికరం

పరికరాల్లో లోపించిన నాణ్యత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో రెండు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో, ఫణిగిరి గుట్టకు వెళ్లే దారిలో ఈ జిమ్‌లు ఉన్నాయి. ఒక్కో జిమ్‌లో దాదాపు రూ. 10 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలు, నేలపై మ్యాట్‌లను ఏర్పాటు చేశారు. నాణ్యత లేని వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతోపాటు నిర్వహణ లేక పరికరాలు చాలావరకు సరిగా పనిచేయడం లేదు. ఫ్లోర్ మ్యాట్‌లు కూడా పాడైపోయాయి. ప్రస్తుతం ఆయా జిమ్‌లలో నేలపై ఏర్పాటు చేసిన మ్యాట్‌లు మాయమయ్యాయి. జిమ్‌కు వచ్చే ప్రజలు గత్యంతరం లేక సరిగా పనిచేయని వ్యాయామ పరికరాలను అలాగే ఉపయోగిస్తున్నారు.

ఆధునీకరణ పేరిట ఆట వస్తువుల ఏర్పాటు

కోదాడ: నాలుగు సంవత్సరాల క్రితం కోదాడలోని గాంధీ పార్కు ఆవరణలో రూ.5లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. నాణ్యతలేని పరికరాలు కావడంతో సంవత్సరం లోపే అవి పాడైపోయాయి. కింద వేసిన ఫ్లోర్ కూడా పాడైపోయింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో వాటిని తొలగించి గాంధీ పార్కును ఆధునీకరిస్తున్నామని మరో రూ.25 లక్షలు ఖర్చు చేసి ఓపెన్‌జిమ్ స్థానంలో పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. దీంతో ఓపెన్ జిమ్ ఆనవాలు లేకుండా పోయింది.



కోదాడలో ఓపెన్ జిమ్ స్థానంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఆట పరికరాలు

బాధితులతో స్నేహపూర్వకంగా మెలగండి



పోలీస్ సిబ్బందికి చెందిన సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

- ఎస్పీ నరసింహ

పెన్‌పహాడ్ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ నరసింహ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీసు స్టేషన్ ఆవరణలో సిబ్బంది కవాతు నిర్వహించారు. స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం రికార్డులు, పోలీస్ స్టేషన్ మ్యాప్, గ్రామాల హద్దులు, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీ షీటర్లు, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ పరిధిలో గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో నిరంతరం పెట్రోలింగ్, తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళా కేసుల్లో ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మానవ అక్రమ రవాణా, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్‌ఐ గోపికృష్ణ, డీసీఆర్బీ ఎస్‌ఐ యాకూబ్, డీసీఆర్బీ సిబ్బంది అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించి గరుడ వాహనంపై స్వామిఅమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇందిరమ్మ ఇళ్ల అవినీతిపై మంత్రి ఉత్తమ్ సీరియస్

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచన
- అధికారుల విచారణ
- పంచాయతీ కార్యదర్శిపై వేటు

భానుపురి(సూర్యాపేట) పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి తీరుపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోపాటు, అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు సూచించారు. దీంతో కలెక్టర్.. లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్న ఆడియో రికార్డులను పరిశీలించారు. ప్రాథమికంగా ఆరోపణలు నిజమని నిర్ధారించుకున్న కలెక్టర్.. గ్రామ కార్యదర్శి వెంకటయ్యను జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అనంతరం ఈ విషయమై సమగ్ర విచారణ జరపాల్సిందిగా హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం హౌసింగ్ శాఖ డీఈ సిద్ధార్థ, డీఈ జబ్బార్, ఎంపీడీఓ లక్ష్మి బృందం గ్రామంలో విచారణ చేపట్టింది. లబ్ధిదారుల నుంచి పంచాయతీ కార్యదర్శి డబ్బులు వసూలు చేసినట్లు నిజమని విచారణలో రుజువైంది. నివేదికను వారు కలెక్టర్‌కు సమర్పించారు. స్పందించిన కలెక్టర్.. గ్రామ కార్యదర్శి ఇంజమూరి వెంకటయ్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ సమయంలో జాన్ పహాడ్ గ్రామపంచాయతీ విడిచి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల నుంచి ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే సస్పెండ్ చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



పానుగోడు పీఏసీఎస్ గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్



గరిడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

గరిడేపల్లి : యూరియా విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామంలోని సహకార సంఘం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎరువుల దుకాణాన్ని పరిశీలించి యూరియా నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పానుగోడు గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. పలు రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పానుగోడు పాఠశాలలో ఒకే ఆవరణంలో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలు ఉండడంతో రెండు పాఠశాలలకు కలిపి వంటలు వండించాలని సూచించారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సహకార సంఘం, ప్రభుత్వ పాఠశాలలు, నర్సరీ, ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. ఆరోగ్య కేంద్రానికి ఎంత మంది అవుట్ పేషెంట్స్ వస్తున్నారని వైద్యాధికారి నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తుండగా అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవనం విషయం విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే డీఆర్‌డీఓకు ఫోన్ చేసి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నర్సరీని పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండ కవిత, ఎంపీడీఓ సరోజ, ఎస్‌ఐ చలికంటి నరేష్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఏఈలు కళ్యాణ్, సిద్ధార్థ, ఆర్‌ఐలు ప్రవీణ్, రాంబాబు, ఏపీఎం అజయ్, ఏపీఓ సురేష్, ఎంపీఓ ఇబ్రహీం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటనలో అపశృతి...

గరిడేపల్లి మండలంలో నాలుగు గంటలకుపైగా సమయాన్ని కేటాయించిన కలెక్టర్ పర్యటనలో చిన్న అపశృతి చోటు చేసుకుంది. గరిడేపల్లిలో ఎరువుల దుకాణం ఎదుట మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్ వాహనం నుంచి దిగుతున్న సమయంలో వాహనం కదలడంతో ఆయన కాలిపై వాహనం టైర్ ఎక్కడంతో గాయమైంది. దీంతో ఆయనకు దగ్గరుండి చికిత్స చేయించాలని ఆర్ రాంబాబుకు కలెక్టర్ సూచించారు.

పిల్లల భద్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ

- ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఒకరి ఎంపిక
- మూడు విడతల్లో నిర్వహించేందుకు కార్యాచరణ
- స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోనున్న ప్రభుత్వం



నాగారం : ప్రస్తుతం సమాజంలో పిల్లలకు ఇంటా, బయట రక్షణ కొరవడింది. ఈవ్ టీజింగ్, ఇతర వేధింపులు, గృహ హింసకు గురవుతున్నారు. దీంతో పిల్లల భద్రతకు ప్రాధాన్యమిస్తూ వారికి పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి పిల్లల భద్రత, మానవ అక్రమ రవాణా, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. జిల్లాస్థాయిలో మూడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని 181 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు.

శిక్షణ వివరాలు..

జిల్లాలోని 181 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాల్లో మొదటి విడత శిక్షణ అక్టోబర్ 6, 7 తేదీల్లో, రెండో విడత అక్టోబర్ 8, 9 తేదీల్లో, మూడో విడత అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఉపాధ్యాయుల ద్వారా పిల్లలకు అవగాహన


పిల్లల భద్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించి వారి ద్వారా పిల్లలకు అవగాహన కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. పిల్లల శారీరక, మానసిక స్థితి, ఆర్థిక భద్రతపై దృష్టి సారిస్తున్నారు. కుటుంబంలో, బయట భద్రత పొందేలా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. గృహ హింస, కుటుంబ సభ్యుల నుంచి వేధింపులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో సూచిస్తారు. ఇందులో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయనున్నారు.

జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు



పిల్లల భద్రత అంశంపై ఉపాధ్యాయులకు జిల్లాలో మూడు విడతలలో శిక్షణ ఇప్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ శిక్షణ అక్టోబర్ 6 నుంచి 15 వరకు కొనసాగుతుంది. సమాజంలో పిల్లలు భద్రత పొందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.

–అశోక్, డీఈఓ, సూర్యాపేట



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా మంగళవారం రాత్రి దిగువకు విడుదలవుతున్న కృష్ణా జలాలు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో మూడో స్థానం



కీర్తనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నల్లగొండ: నల్లగొండలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి .కీర్తన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటింది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 3వ స్థానం సాధించింది. కీర్తనను మంగళవారం ప్రిన్సిపాల్ కుతేజుల్ కుబ్రా, అధ్యాపకులు అభినందించారు.

శ్వాస మీద ధ్యాసతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యాన మందిరంలో మాట్లాడుతున్న సంత్‌సదానంద గిరి మహరాజ్ స్వామీజీ

సూర్యాపేట: శ్వాస మీద ధ్యాసతోనే ఆరోగ్యంగా ఉంటామని సంత్‌సదానంద గిరి మహరాజ్ స్వామీజీ అన్నారు. మంగళవారం గుంటూరు నుంచి వరంగల్ వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల పిరమిడ్ ట్రస్ట్ ధ్యాన మందిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి ధ్యానం చేస్తూ ఆరోగ్యముక్తిని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షురాలు తోట నాగమణి, ప్రధాన కార్యదర్శి గుండా వెంకటేశ్వర్లు, కోశాధికారి చందా విశ్వనాథం, ఉపాధ్యక్షులు కోటగిరి రాధాకృష్ణ, కక్కిరేణి రవిచంద్ర, హరిప్రసాద్, దయాసాగర్, శ్రీనివాస్, విజయ్, సువర్ణ, కేదారేశ్వరి, సంధ్య, మహేందర్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

భువనగిరి: అప్పుల బాధతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లేపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి మాధవి(35), నర్సింహ భార్యాభర్తలు. అప్పులు ఎక్కువ కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం అప్పుల విషయమై ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన మాధవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సమయం తర్వాత ఇంట్లోకి వచ్చిన వారి కుమారుడు గమనించి స్థానికులకు సమాచారం అందించాడు. స్థానికులు వచ్చి చూడగా.. అప్పటికే మాధవి మృతిచెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతిరాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది.

వాహనం ఢీకొని రెండు ఆవులు మృతి

త్రిపురారం: వాహనం ఢీకొని రెండు ఆవులు మృతిచెందాయి. ఈ ఘటన త్రిపురారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని రాజమండ్రి నుంచి కొబ్బరికాయల లోడుతో జడ్చర్లకు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం త్రిపురారం మండల కేంద్రంలో రెండు ఆవులకు ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని బాధిత రైతు వలసాని సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

● భూమికి పచ్చాని రంగేసినట్టు..



యాదగిరిగుట్ట: గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు యాదగిరిగుట్ట పట్టణమంతా ఎక్కడ చూసినా ఆకుపచ్చని అందాలతో కనువిందు చేస్తోంది. యాదగిరి కొండపై నుంచి ఎటుచూసినా కనుచూపు మేర పచ్చని పొలాలు, చెట్ల మధ్యన ఇళ్లతో ఆకట్టుకుంటోంది.

కేబుల్ వైర్లు కట్ చేయాల్సిందే

- విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తొలగించాలని ప్రభుత్వం ఆదేశం
- క్రమపద్ధతిలో అమర్చుకోవడంలో ఆపరేటర్లు విఫలం

కోదాడ: విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న కేబుల్ వైర్లతో నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు క్రమపద్ధతిలో అమర్చుకోవాలని విద్యుత్ శాఖ చెబుతున్నా ఇప్పటివరకు పెడచెవిన పెట్టిన కేబుల్ ఆపరేటర్లకు ఆ శాఖ షాక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో రెండు రోజుల క్రితం కేబుల్ వైర్ల వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి ఐదుగురు చనిపోవడంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీల్లో స్తంభాలకు వేలాడదీసిన కేబుల్ వైర్లను ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో స్థానిక సిబ్బంది రెండు మూడు రోజుల్లో కత్తిరించి వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

అవగాహన లోపంతోనే తిప్పలు

మున్సిపాలిటీల్లో కేబుల్ కనెక్షన్లతో పాటు ఇంటర్నెట్ కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తుంటారు. పదుల సంఖ్యలో ఉన్న ఆపరేటర్లు ఇష్టారీతిన వీటిని స్తంభాలకు వేలాడదీస్తుండడంతో సమస్య వచ్చినపుడు స్తంభం ఎక్కడానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని విద్యుత్ సిబ్బంది చెబుతున్నా ఆపరేటర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు తక్కువ ఎత్తులో తీగలను వేలాడదీస్తుండడంతో భారీ వాహనాలకు తగిలి తరచూ ఇవి తెగిపడడం, కిందకు జారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కట్టలుగా కేబుల్ వైర్లను స్తంభాలకు కడుతుండడంతో షార్ట్ సర్క్యూట్స్ సర్వసాధారణంగా మారాయి.



కోదాడలోని నయానగర్‌లో విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లు

కట్ చేస్తే ఇబ్బందే..

విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కేబుల్ వైర్లను కట్ చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు అంటున్నారు. సాధారణ టీవీ కేబుల్స్‌తో పాటు ఇంటర్‌నెట్ కేబుల్స్ కూడా విద్యుత్ స్తంభాలకు ఉన్నాయి. వీటిని కట్ చేస్తే పలువురికి ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా పోతుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేసే ఐటీ ఉద్యోగులతో పాటు విద్యార్థులు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తుగా ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి



అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండ్లపల్లి కల్యాణ మండపంలో మంగళవారం టీయూ జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోడి సైదులుయాదవ్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసులకు, పోలీసు తూటాలకు భయపడకుండా పాల్గొన్నామని గుర్తు చేశారు. ఉద్యమకారులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం, నాలుగు గదుల ఇళ్ల నిర్మాణం, రూ.30వేల పెన్షన్ సౌకర్యం కల్పించి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యమకారులకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా విద్య, వైద్యం, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చూడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రన్న ప్రసాద్, క్రిస్టోఫర్, బి. లావణ్య, వైస్ ప్రెసిడెంట్‌లు అంజలికుమారి, హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ తుల్జారెడ్డి, సలహాదారులు శంకర్‌రావు, తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లారా, కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూసుఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కపాక కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జటంగి సౌనయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడబోయిన గంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిగుజ్జు రామచంద్రయ్య, టీయూ జేఏసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గోనే విజయ, కమ్మంపాటి లక్ష్మమ్మ, తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక జిల్లా అధ్యక్షురాలు తండు దేవిక, జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల ఉమా, పట్టణ అధ్యక్షురాలు బంటు ఎల్లమ్మ, ప్రధాన కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

మూత్రవిసర్జనకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్: ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురైన మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాలబావి సెంటర్‌లో నివాసముంటున్న దంతాల చక్రధర్‌రావు(56) గతంలో ప్రైవేట్ లెక్చరర్‌గా పనిచేసేవాడు. గత రెండేళ్లగా ఖాళీగానే ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వాణిజ్య భవన్ సెంటర్ వైపు వెళ్లి పాత మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్రవిసర్జన చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రోహిణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో పోలీసులు, విద్యుత్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకే అది విద్యుదాఘాతమా లేదా ఇంకేమైనా కారణం ఉండొచ్చా అనేది చెబుతామని పట్టణ సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొండమల్లేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొర్రతండాలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రతండాకు చెందిన కొర్ర పట్టి గ్రామంలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టింది. ఆమె భర్త ధన్య గతంలోనే మృతిచెందాడు. కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పక్కనే జహిందర్ ఇంట్లో పట్టి అద్దెకు ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె అద్దెకు ఉంటున్న ఇంటికి తాళం వేసి కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లోకి వెళ్లి నిద్రించింది. మంగళవారం ఉదయం అద్దె ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని కేజీ వెండి, రూ.1.50లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాదగిరీశుడి హుండీ ఆదాయం రూ.2.35కోట్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, కానుకలను మంగళవారం కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ వెంకట్రావ్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. మొత్తం రూ.2,35, 32,627 నగదు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. మిశ్రమ బంగారం 76 గ్రాములు, మిశ్రమ వెండి 9కిలోల 475గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ దేశాల కరెన్సీలు సైతం హుండీల్లో వచ్చాయని ఈఓ తెలిపారు. హుండీ ఆదాయం 27 రోజులదని వెల్లడించారు.



హుండీల్లో వచ్చిన నగదు, కానుకలను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీ పనుల విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

కోదాడరూరల్: కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామ శివారులో గల మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీ కంపెనీ చేపట్టనున్న 9.87 హెక్టార్ల పనుల విస్తరణపై అదనపు కలెక్టర్ రాంబాబు సమక్షంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్వారీ సమీపంలోని నల్లబండగూడెం, మంగళితండా, చిమిర్యాల గ్రామాల ప్రజలు, నాయకులు మాట్లాడుతూ.. క్వారీ విస్తరించుకుంటే తమకు అభ్యంతరం లేదని.. కానీ స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా క్వారీ నుంచి నల్లబండగూడెం వెళ్తున్న రోడ్డు ధ్వంసమైందని.. ఈ మార్గంలో వాగుపై ఉన్న బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలన్నారు. మూడు గ్రామాలల్లో నెలకోసారి హెల్త్ క్యాంపులు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులున్న ప్రజలకు మందులు అందజేయాలని కోరారు. అదేవిధంగా పాఠశాలల అభివృద్ధికి, చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయాలన్నారు. పలు ఎన్జీఓలు, పర్యావరణ, సామాజిక ఉద్యమకారులు మాట్లాడుతూ.. క్వారీ నుంచి దుమ్ముధూళి రాకుండా చూడాలని సూచించారు. క్వారీ చుట్టూ ఉన్న రైతుల పొలాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం కాలుష్యం జరగకుండా పరిసర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలన్నారు. కంపెనీ సీఓఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ.. క్వారీలో 80శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పిస్తున్నామని, విద్యార్హతను బట్టి టెక్నీషియన్స్, ఎలక్ట్రానిక్స్, ఆపరేటర్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు ఇస్తామన్నారు. ఇప్పటికే క్వారీ చుట్టూ ఉన్న మూడు గ్రామాల కోసం ఓ అంబులెన్స్ ఏర్పాటును చేశామని, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలలో మందులు ఇస్తున్నామని, పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు కూడా నాటుతామని సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురి వద్ద నుంచి లిఖితపూర్వకంగా, 40మంది నుంచి తీసుకున్న అభిప్రాయాలను రాష్ట్ర పర్యావరణ ఉన్నతాధికారులకు పంపిస్తామని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ వెంకన్న, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజిద్‌అలీ, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో తమ అభిప్రాయాలను తెలుపుతున్న స్థానికులు

దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలి

రామన్నపేట: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశభక్తితో పాటు సత్ప్రవర్తన, సేవాభావం పెంపొందించుకోవాలని 31(టీ) బెటాలియన్ కల్నల్ టి. లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశం కొరకు దేహదారుఢ్య, రాత పరీక్ష నిర్వహించారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఆర్మీ, పోలీసు ఉద్యోగాలు పొందడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రాచమల్ల శ్రీను, బెటాలియన్ సుబేదార్ మేజర్ మాధవరావు, సుబేదార్ కొమ్ము మల్లయ్య, హవల్దార్లు సురేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో కల్నల్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం

బుద్ధవనం సందర్శించిన ఉత్తరప్రదేశ్ ప్రతినిధులు



బుద్ధుడి పాదుకలకు పూజలు చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కౌశాంబి జిల్లాలో 10 ఎకరాల్లో బుద్ధవనం తరహాలో థీమ్ పార్కు నిర్మించనున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలేంద్రసింగ్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర స్వాగతం పలికారు. యమునా నది తీరంలో ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి ప్రాంతంలో జ్ఞానసిద్ధికై సిద్ధార్థుడు మూడేళ్ల పాటు తపస్సు చేశాడని.. అంతటి ప్రసిద్ధమైన ప్రదేశంలో రూ.80కోట్ల వ్యయంతో బుద్ధిష్ట్ థీమ్ పార్కు నిర్మించనున్నట్లు శైలేంద్రసింగ్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు దీనిని పూర్తిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వెంట ఆర్కిటెక్ట్ రాహుల్, ఇంజనీర్ కళ్యాణ్‌చంద్ర, స్తపతి గిరీష్‌తివారి ఉన్నారు. వీరికి గైడ్ సత్యనారాయణ బుద్ధవనం గురించి వివరించారు.

సాగర్‌కు పోటెత్తిన వరద.. ఆగిన లాంచీలు

నాగార్జునసాగర్: ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే వరద భారీస్థాయిలో పెరగడంతో పాటు గాలి వీస్తుండటంతో మంగళవారం నాగార్జునకొండకు లాంచీలు నిలిచిపోయాయి. శ్రీశైలం జలాశయం నుంచి 10గేట్లు ద్వారా 3,44,750 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో మరో 65436 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీనికి తోడు గాలి వీస్తోంది. దీంతో సాగర్ జలాశయంలో అలజడి మొదలై అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆంధ్రా పరిధిలోని రైట్‌బ్యాంక్ నుంచి నాగార్జునకొండ మ్యూజియంలో పనిచేసే ఉద్యోగులను నిత్యం లాంచీలలో తీసుకొస్తుంటారు. అయితే గాలి వీస్తుందని అక్కడి లాంచీలు సరైన ఫిట్‌నెస్ లేకపోవడంతో నడపలేదు. మ్యూజియం తెరవకపోవడంతో తెలంగాణ నుంచి కూడా లాంచీలను నాగార్జునకొండకు నడపలేదని సిబ్బంది తెలిపారు. జాలీ ట్రిప్పులు వేసేందుకు కొంతమేరకు అవకాశమున్నప్పటికీ పర్యాటకులు లేకపోవడంతో లాంచీలను నడపలేదని సమాచారం.



సాగర్ జలాశయ తీరంలో నిలిచిన లాంచీలు

14 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి వరకు 3,97,807 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 14 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 4,13,395 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటితో నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టెయిల్‌పాండ్ నుంచి 16 గేట్ల ద్వారా దిగువకు..




టెయిల్‌పాండ్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి సమీపంలో కృష్ణానదిపై గల టెయిల్‌పాండ్ నుంచి వరద నీటిని 16 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం నాగార్జునసాగర్ జలాశయం నుంచి 3,94,329 క్యూసెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వచ్చి చేరుతుండగా.. దిగువకు 4,03,241 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో ఉపాధి

- ఆదర్శంగా నిలుస్తున్న చీదెళ్ల గ్రామ యువకులు





నారాయణపురంలో డ్రమ్‌సీడర్‌లు లాగుతున్న చీదెళ్ల యువకులు

నడిగూడెం: వ్యవసాయంలో కూలీలు కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పెట్టుబడులు కూడా బాగా పెరిగాయి. పంటల సాగులో కొత్త పద్ధతులు వస్తుండడంతో రైతులకు ఉపయోగకరంగా మారాయి. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఒక బృందంగా ఏర్పడి జిల్లాలోని పలు గ్రామాల్లో తిరుగుతూ డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరి సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

రోజుకు 7 నుంచి 8 ఎకరాల్లో..

చీదెళ్ల గ్రామానికి చెందిన తండు ప్రవీణ్, వేర్పుల వీరబాబు, వేల్పుల మధు, వరికల్లు శ్రీను ఒక బృందంగా ఏర్పడి స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో నాలుగు డ్రమ్ సీడర్‌లు కొనుగోలు చేశారు. వీరు గత ఐదేళ్ల నుంచి సూర్యాపేటతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోని నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని గ్రామాల్లో డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా రైతుల భూముల్లో నేరుగా వరి విత్తనాలు విత్తుతున్నారు. దీనికి గాను ఎకరానికి రూ.1000 చొప్పున రోజుకు నాలుగు డ్రమ్ సీడర్‌లతో 7 నుంచి 8 ఎకరాల్లో వరి విత్తనాలు విత్తుతున్నారు. దీంతో ఆ నలుగురు కలిసి ఒక్కొక్కరు రోజుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్‌లలో నాలుగు నెలల వరకు పని ఉంటుందని వారు చెబుతున్నారు.

ఐదేళ్లుగా ఉపాధి పొందుతున్నాం



ఐదేళ్ల క్రితం స్నేహితులతో కలిసి నాలుగు డ్రమ్‌సీడర్‌లు కొనుగోలు చేశాం. మా మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాలు వేశాక, రైతుల ద్వారా పక్క మండలాల్లో కూడా విత్తనాలు వేస్తున్నాం. ఒక ఎకరంలో విత్తనాలు వేస్తే ఎకరానికి రూ.1000 చెల్లిస్తున్నారు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి పొందుతున్నాం.

– తండు ప్రవీణ్, చీదెళ్ల

8 ఎకరాల్లో విత్తనాలు వేస్తున్నాం



రోజుకు 7 నుంచి 8 ఎకరాల్లో డ్రమ్ సీడర్ల ద్వారా వరి విత్తనాలు వేస్తున్నాం. రోజుకు మాకు రూ.1500 నుంచి రూ.2000 వరకు కూలీ గిట్టుబాటు అవుతుంది.

– వేర్పుల వీరబాబు, చీదెళ్ల